నేడు కొడంగల్‌లో తిరుపతిరెడ్డి పర్యటన

కొడంగల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

కొడంగల్ నియోజకవర్గంలో మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్ తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట్, కొడంగల్‌మండలాల్లో పలు అభివృద్ధి పనులకు తిరుపతిరెడ్డిచేతులమీదుగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మంగళవారం ఉదయం 9:30గంటలకు బొంరాస్‌పేట్‌మండలంలోని మెట్లకుంటరోడ్డుకు భూమిపూజతో రోడ్డుపనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం బురాన్‌పూర్, నాగారం రోడ్డు, జాతీయ రహదారినుంచి బొంరాస్‌పేట్ మండలకేంద్రంవరకు నాలుగువరుసల రోడ్డు, ఏర్పుమళ్ళ, బుద్లపూర్ రోడ్డు, చౌదర్‌పల్లిరోడ్డుతోపాటు కొడంగల్ పట్టణంలో జాతీయరహదారి-167 రోడ్డు విస్తరణపనులకు భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని కడా కార్యాలయంలో ఎస్సీ కుట్టుమిషన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని నందారం ప్రశాంత్ తెలిపారు.

ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరం

-కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

శంకర్‌పల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

గిరిజనుల భూములను ఆక్రమించుకుని వారిపైనే అక్రమంగా కేసులు బనాయించి వేధింపులకు పాల్పడుతుంటే తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని కొండకల్ తండావాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల భూములను ఆక్రమించుకున్న కార్పొరేట్ సంస్థకు వ్యతిరేకంగా గిరిజనులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో 95వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలను లక్ష్యంగా చేసుకొని వేధింపులకు పాల్పడుతుంటే బాధ్యతాయుతంగా వ్యవహరించి న్యాయం చేయాల్సిన ప్రభుత్వం, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజనులకు న్యాయం చేయాలని స్పష్టంగా ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి

దేవస్థానంలో ప్రత్యేకపూజల్లో పాల్గొన్న ఎంపి ఈటల రాజేందర్

కీసర, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

ప్రతి ఒక్కరూ దైవచింతనను అలవర్చుకోవాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులోని శిల్పానగర్ కాలనీలోని శ్రీమరకతచంద్రమౌళీశ్వరస్వామి, శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి, శ్రీకార్యసిద్ధి ఆంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవాలలో ఎంపి పాల్గొన్నారు. ఎంపికి ఆలయ చైర్మన్ గూడూరు ఆంజనేయులుగౌడ్ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీచైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మాజీకౌన్సిలర్ కౌకుట్ల అనంతరెడ్డి,నాయకులు గండి అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలి

దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

కీసర, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

దమ్మాయిగూడ మున్సిపల్ కార్మికులకు పెండింగులో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని మేడ్చల్ జిల్లా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. ఈసందర్భంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసలే చాలీచాలని జీతాలతో కార్మికులు సతమతమవుతుంటే రెండునెలల నుండి జీతాలు ఇవ్వకపోతే వాళ్లు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. ఇంటి కిరాయి, రోజు ఖర్చులు, పనికి రావడానికి అయ్యే ఖర్చులు ఎలా సమకూర్చుకోవాలని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే మున్సిపల్ కార్మికులకు జీతాలను ఇవ్వకపోతే తమపోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఉన్ని క్రిష్ణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరిపై దేవుని కృప ఉండాలి

దేవస్థానంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

ప్రజలందరిపై దేవుని కృప ఉండాలని మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 7వవార్డులోని శిల్పానగర్ కాలనీలోని శ్రీమరకతచంద్రమౌళీశ్వరస్వామి, శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి, శ్రీకార్యసిద్ధిఆంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో నాగారం పట్టణ టిఆర్ఎస్ అధ్యక్షులు తేళ్ల శ్రీధర్‌పటేల్, మాజీ కౌన్సిలర్లు కౌకుట్ల అనంతరెడ్డి, అన్నంరాజు లావణ్య శ్రీనివాస్, నాయకులు చిన్నంరాజు సాయినాథ్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

ధాన్యం ఆరబెట్టేందుకు కరువైన కల్లాలు

-రోడ్లపై ధాన్యం ఆరబెడుతున్న రైతులు

రోడ్లపైనే నూర్పిడి చేస్తున్న రైతులు

దుద్యాల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

రోడ్లే కల్లాలుగా మారడంతో ప్రయాణాలు చేయడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రయాణికులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని సాగారం తండా, గౌరారం, గౌరారం తండా, ముచ్చుకుంట తండా, సోంలనాయక్ తండాలలో పాటు ఇతర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులలో రైతులు ధాన్యం ఆరబెడుతున్నారు. రైతులు పండించిన ధాన్యం ఆరబెట్టేందుకు పొలంలో కల్లాలు ఏర్పాటుచేసుకోవడానికి గతంలో ఎన్ఆర్ఈజిఎస్ పథకం కింద నిధులు మంజూరుచేసేవారు. అలా కొంతమంది రైతులకు కల్లాలు ఏర్పాటు చేసుకోవడానికి నిధులు మంజూరు చేయడంతో వారివారిపొలాల్లోనే కల్లాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కల్లాలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండించిన దాన్యం ఆరబెట్టుకునేందుకు కల్లాలు లేకపోవడంతో రైతులు ఏకంగా రోడ్లు, కల్వర్టుల ఽ కల్లాలుగామార్చుకొని ధాన్యం ఆర బెడుతున్నారు. రోడ్లపై ప్రయాణంచేసే ప్రయాణికులు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో ప్రయాణం మరింత ప్రాణసంకటంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై ధాన్యం ఆరబోత ను అరికట్టాలని వాహన చోదకులు డిమాండ్ చేస్తుండగా, కల్లాలు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

షాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

మండలపరిధిలోని నాన్‌దార్‌ఖాన్‌పేట్ గ్రామంలో మైసమ్మతల్లి ఆలయ నిర్మాణానికి మాజీ ఎంపిటిసి పొన్న జయమ్మ వెంకట్‌రెడ్డి మంగళవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా మాజీ ఎంపిటిసి మాట్లాడుతూ గ్రామాలకు రక్షణగా గ్రామదేవతలు ఉంటారని నాన్‌దార్‌ఖాన్‌పేట్ గ్రామంలో మైసమ్మతల్లి ఆలయాన్ని నిర్మించడం శుభపరిణామం అన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

-వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

తెలంగాణా ఓపెన్ స్కూల్, ఓపెన్ ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలనీ, ఎట్టి పరిస్థితుల్లో పరీక్షాకేంద్రంలోనికి సెల్ ఫోన్లు అనుమతించకూడదని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్సు హాలునందు పరీక్షాకేంద్రాల చీఫ్‌సూపరింటెండెంట్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు తెలంగాణా ఓపెన్ స్కూల్, ఓపెన్ ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమావేశము నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 8సెంటర్లు ఏర్పాటు చేయగా ఓపెన్ స్కూల్ వికారాబాద్‌లో రెండు సెంటర్లు, తాండూర్‌లో ఒకటి, ఓపెన్‌ఇంటర్ వికారాబాద్‌లో మూడు సెంటర్లు, తాండూర్‌లో రెండుసెంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30గంటల నుండి సాయంత్రం 5.30గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలు ఈనెల 20వ తేదీనుంచి 26వ తేదీవరకు ఉంటాయని, ఎలాంటి మాస్ కాపీ జరుగకుండా పూర్తిస్థాయిలో చెకింగ్‌చేసి పంపించాలని అన్నారు. ప్రశ్నాపత్రాలు ఇచ్చేటపుడు సంస్కృతం, తెలుగు కోడ్ నెంబర్లు చెక్‌చేసి ఇవ్వాలని ఆదేశించారు. పరీక్ష సెంటర్ దగ్గరలో జిరాక్స్ సెంటర్ల ఽ మూసివేయించాలని, పరీక్షాకేంద్రంలోనికి ప్రవేశించే ఏవ్యక్తి దగ్గర కూడా మొబైల్ ఫోన్ ఉండడానికి వీలులేదన్నారు. విధినిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించరాదని, ఎక్కడ ఎలాంటి సమస్య రాకుండా జాగ్రతగా పరీక్షల నిర్వహణ జరగాలని ఆదేశించారు. పరీక్షాకేంద్రంలోనికి ప్రవేశించే వ్యక్తులు, పరీక్షాకేంద్రం సిబ్బంది, స్క్వాడ్స్ తప్ప ఇతరులు ప్రవేశించరాదని తెలిపారు. ప్రతి విద్యార్థిని తప్పకుండా క్షుణ్ణంగా పరీక్షించినతర్వాత ఎలాంటి మెటీరియల్స్ లేవని నిర్ధారించుకొని కేంద్రంలోనికి అనుమతించాలని తెలిపారు. ప్రతి పరీక్షాకేంద్రంలో కచ్చితంగా సిసి కెమెరాలు, మంచినీటిసౌకర్యం, విద్యుత్ సరఫరా, లైటింగ్, ఫ్యాన్స్ ఉండేవిధంగా చూడాలన్నారు. సూచనలు కచ్చితంగా పాటించాలని, ఏవిధమైన పొరపాటు జరిగినా కఠినమైనచర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, డిఎస్‌పిలు శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ రెడ్డి, ఫ్లయింగ్‌స్క్వాడ్, సిట్టింగ్‌స్క్వాడ్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఇందిరమ్మ ఇళ్లపునాది నిర్మాణానికి నిధులు మంజూరు

లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

వికారాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా 300గృహాలకు మార్కింగ్ చేయగా, అందులో 25 మంది లబ్దిదారులు మంగళవారం వరకు బెస్‌మెంట్ నిర్మాణం చేసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారము శంషాబాద్ నోవాటెల్ హోటల్ నందు రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఎంపికైన లబ్దిదారులకు బెస్మెంట్ నిర్మాణానికై లక్ష రూపాయల చొప్పున ఇద్దరు లబ్దిదారులకు రెండు లక్షల చెక్కులు అందజేయడం జరిగిందని తెలిపారు. మిగతా లబ్ది దారులకు ఆన్లైన్ ద్వార చెల్లింపులు జరుగుతాయని పేర్కొన్నారు. కోడంగల్ నియోజకవర్గం దుద్యాల్ మండలం సంగాయిపల్లి గ్రామానికి చెందిన నూర్జహాన్ బేగం, పరిగి నియోజకవర్గం పూడూరు మండలం ఎన్కెపల్లి గ్రామానికి చెందిన మాల లక్ష్మి కి చెక్కులు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర ఉన్నతాదికారులు తదితరులు ఉన్నారు.

ఆర్‌అండ్‌బి మెయిన్ రోడ్డు పక్కనే చెత్తడంప్

శామీర్‌పేట, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

అలియాబాద్-లాల్‌గడిమలక్‌పేట్ గ్రామాల మధ్య గల ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కనే చెత్తను డంప్ చేస్తుండటంతో మురికికూపంగా మారుతోంది. చెత్తను మెయిన్ రోడ్డు పక్కనే వేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటం శోచనీయం. అలియాబాద్-లక్ష్మాపూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన మెయిన్ ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కనే చెత్తను వేయటం వల్ల మురికికూపంగా మారటంతోపాటు దుర్వాసనతో వాహనదారులకు, పాదచారులకు కూడా ఇబ్బందికరంగా మారింది. చెత్తను డంప్ చేయటం వల్ల పందులు,కుక్కలు సంచరిస్తూ ఉన్నాయి. అలియాబాద్ గ్రామం పక్కనే ప్రధాన మెయిన్ రోడ్డుకు పక్కనే చెత్తనువేయటం వల్ల ప్రధానంగా అలియాబాద్ గ్రామానికి విడ్డూరంగ కనిపిస్తుంది. ఈరోడ్డున నిత్యం వందలాది వాహనాల రాకపోకలు కొనసాగుతూ ఉంటాయి. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాలవారితోపాటు పరిసర సిద్దిపేట్ జిల్లా గ్రామాలకు, యాదాద్రి-భువనగిరి జిల్లాలోని గ్రామాలకు కూడ ప్రధాన రహదారిగా ఉంటూ వాహనాల రాకపోకలు కొనసాగటం జనసంచారం ఉండే ప్రాంతంగా చెప్పవచ్చు. అలియాబాద్-లాల్‌గడిమలక్‌పేట్ గ్రామాలమధ్యన ఈరోడ్డులోనే ప్రైవేట్‌స్కూల్‌కూడా ఉండటంతో విద్యార్థుల రాకపోకలు కూడా ఈరోడ్డునుంచి నిత్యం కొనసాగటం జరుగుతూ ఉంటుంది. శామీర్‌పేట ఉమ్మడిమండలంలోనే అలియాబాద్-లక్ష్మాపూర్ గ్రామాల మధ్య ప్రధాన రోడ్డుగా చెప్పవచ్చు. ఈ రోడ్డుపక్కనే చెత్తనువేయటం వల్ల అభివృద్ధికి విడ్డూరంగా కనిపిస్తూ ప్రజలకు కూడా రోగాలు సంభవించే పరిస్థితి దాపురిస్తున్నట్లు చెప్పవచ్చు. కనీసం అలియాబాద్ గ్రామపంచాయతీకార్యదర్శి,సిబ్బంది,లాల్‌గడిమలక్‌పేట్ గ్రామపంచాయతీ కార్యదర్శి,సిబ్బంది కూడా ఈరూట్‌లో తిరుగుతున్నా రోడ్డు పక్కన వేస్తున్న చెత్తగురించి పట్టించుకోవటం లేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగించాలని, చెత్తను వేయకుండా తగుచర్యలు తీసుకోవాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈవిషయంపై జిల్లా ఆర్‌అండ్‌బి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

మురికికూపంగా మారుతున్నా పట్టించుకోని అధికారులు

ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కనే చెత్తడంప్ చేస్తున్న దృశ్యం

ఉత్తమ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు

సమావేశంలో మల్లారెడ్డి యూనివర్శిటీ ఫౌండర్ మల్లారెడ్డి

మేడ్చల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలన్న సంకల్పంలో భాగంగా మల్లారెడ్డి యూనివర్శిటీ మెరిట్ స్కాలర్‌షిప్‌లను ప్రకటిస్తున్నట్లు యూనివర్శిటీ ఫౌండర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తెలిపారు. యూనివర్శిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మల్లారెడ్డి యూనివర్శిటీ, అనుబంధ సంస్థతో కలిసి తెలంగాణ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌కు సిద్ధమౌతున్న విద్యార్థుల కోసం టిజి ఈఏపిసెట్ ఆన్‌లైన్ మాక్‌టెస్ట్ 2025ను ప్రకటిస్తున్నదని అన్నారు. ఆన్‌లైన్ మాక్ టెస్ట్ విద్యార్థుల సిద్ధతను సమీక్షించడానికి, వారి నమ్మకాన్ని పెంపొందించడానికి ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ పరీక్ష ఈనెల 20న నిర్వహించనున్నామని, ఈమహోత్తరమైన కార్యక్రమాన్ని ఆధికారికంగా ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల కోసం యునివర్శిటీ మెరిట్ స్కాలర్‌షిప్‌లను ప్రకటిస్తున్నదని, విశ్వవిద్యాలయం ద్వారా అందించబడుతున్న అన్ని కోర్సులకు సంబంధించిన మొదటి 500మెరిట్ ఆధారిత అడ్మిషన్లకు స్కాలర్‌షిప్‌లు లభించనున్నాయని తెలిపారు. ఈస్కాలర్‌షిప్‌లు విద్యార్థుల ఆర్థికభారం తగ్గించేందుకు సహాయపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ విఎస్‌కెరెడ్డి, మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

కొడంగల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

లోక్‌సభలో, రాజ్యసభలో ఆమోదించిన వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని ఎంఐఎం పార్టీ తాలూకా అధ్యక్షులు ఎస్పీ.గుల్షన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 18 న ప్రత్యేక ప్రార్థనల అనంతరం కొడంగల్ పట్టణంలోని వినాయక చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కొడంగల్ జామా మసీదు కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో జామా మసీదు కమిటీ అధ్యక్షులు అప్రోజ్, మక్కా మసీదు ఇమామ్ అబ్దుల్ కరీం, ఫెరోజ్‌ఖాన్, ఎండి.సర్తజ్ హుస్సేన్, షేక్ రుమాన్, ఎండి.అజహర్, ఎండి.అమీర్ హుస్సేన్, సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

వెలిజర్లలో దొంగల హల్‌చల్

-ఒకే రాత్రి మూడు ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ

షాద్‌నగర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

ఒకేరోజు రాత్రి వరుస దొంగతనాలతో కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో వరుస దొంగతనాలు స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవల జరిగిన సంఘటనలతో గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. గ్రామానికి చెందిన వాడ్యాల శ్రీనివాస్‌రెడ్డి, దిర్శనం వెంకటయ్య, వడ్డె శంకరయ్యలకు చెందిన మూడు ట్రాక్టర్ల బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లారు. వట్టెల బాల్‌రాజ్‌కు చెందిన టిప్పర్ వైర్లు కట్ చేసి బ్యాటరీని అపహరించేందుకు ప్రయత్నించారు. దాదాపు లక్షరూపాయలకు పైగా నష్టపోయామని బాధితులు పేర్కొంటున్నారు. భద్రతాపరంగా పెట్రోలింగ్ పెంచాలని రైతులు వేడుకుంటున్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసులు నమోదుచేశారు.

విమాన ప్రయాణికుడి మృతి

-ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన

శంషాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

విమానంలో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు అకస్మాత్తుగా అనారోగ్యానికి గురి కావడంతో ప్రాథమిక చికిత్స చేసి ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో జరిగిన ఈసంఘటన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి ఓ ప్రయాణికుడు విమానంలో వస్తుండగా స్పృహతప్పి పడిపోయాడు. అతడి నోట్లో నుండి ద్రవం కారుతుండడంతో అదే విమానంలో ఉన్న డాక్టర్ ప్రీతిరెడ్డి బాధితుడికి ప్రథమచికిత్స చేశారు. గుండెపోటు వచ్చినట్లు గమనించి సిపిఆర్ చేసి అతడి ప్రాణాలను కాపాడారు. కాగా 74 సంవత్సరాల ఆప్రయాణికుడిని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోకి రాగానే ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించినట్లు తెలిసింది. ఈసంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఎస్‌బిఐ బ్యాంకులో అగ్ని ప్రమాదం..!

-షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
-కాలిపోయిన ఫైళ్లు, కంప్యూటర్‌లు, ఫర్నిచర్
-సుమారు 60లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా

మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తాండూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

వికారాబాద్ జిల్లా తాండూరు మండల పరిధి కరణ్‌కోట్ లోని ఎస్‌బిఐ(స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా)లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ అగ్నిప్రమాదంలో బ్యాంకులోని ఫైళ్లు, కంప్యూటర్‌లు, ఫర్నిచర్, విలువైన సామాగ్రి అగ్నికి ఆహుతైపోయాయి. సుమారు 60లక్షల వరకు నష్టం జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈసంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఇందుకుసంబంధించి తాండూరుమండలంలోని కరణ్‌కోట్‌టౌన్‌షిప్‌లో ఎస్‌బిఐ బ్యాంకు కొనసాగుతుంది. మంగళవారం ఉదయం 9-30గంటల ప్రాంతంలో బ్యాంకు అధికారులు యథావిధిగా బ్యాంకును తెరిచారు. ఒక్కసారిగా బ్యాంకులో నుండి పొగలు రావడంతో బ్యాంకు అధికారులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే కరణ్‌కోట్ పోలీసులతోపాటు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు తీవ్రంగావ్యాపించడంతో బ్యాంకులో అగ్నికీలలు ఎగసిపడ్డాయి. అగ్నిపమాపక అధికారులు మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. తాండూరుతో పాటు కోడంగల్ నుంచి వచ్చిన రెండు ఫైర్ ఇంజన్‌ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే బ్యాంకులోని ఫర్నిచర్, కంప్యూటర్‌లు, విలువైన ఫైళ్లు కాలిబూడిదైపోయాయి. ఈప్రమాదంలో సుమారు రూ.60లక్షల వరకు నష్టం జరిగినట్లు బ్యాంకు అధికారులు వెల్లడించారు. అయితే, బ్యాంకు లాకర్‌లో భద్రపరిచిన నగదు, బంగారం, పట్టా పాసుపుస్తకాలు, ఇతర డాక్యుమెంట్లు భద్రంగానే ఉన్నట్లు బ్యాంకు మేనేజర్ భువన్‌మోహన్ తెలిపారు. ఖాతాదారులు, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. మరోవైపు బ్యాంకు అధికారుల తీరుపై స్థానికులతోపాటు పలువురు ఖాతాదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల బ్యాంకులో ఫర్నిచర్‌తో పాటు ఫైకప్పుకు థర్మకోల్‌తో నూతనంగా రూఫ్ చేయించడంతో షార్ట్‌సర్క్యూట్ జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తంచేశారు.

ఎంపి ఈటలకు వినతి

మేడ్చల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరి చేయాలని కోరుతూ మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌కు ఆగ్రామ బిజెపి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోచయ్య ముదిరాజ్, నాయకులు కృష్ణ, రవిచంద్ర, భూపాల్, సురేందర్, భిక్షపతి, నర్సింహ్మ, ఎల్లేష్, రఘు, రాంచందర్, పోచయ్య, హరి, సాయిబాబా, కరుణాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కొత్త కార్యవర్గ ఎన్నిక

హైదరాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌కు 2025-29కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గం తదితరులు

నాంపల్లి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా హెచ్ఎఫ్ఐకు చెందిన హైదరాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ 2025-29కుగాను నూతన కార్యవర్గం ఎన్నికలు విజయవంతంగా జరిగాయి. ఈ ఎన్నికలు తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ టిహెచ్ఎ సి. తిరుమల్‌రెడ్డి సహకారంతో బి.లక్ష్మణ్ పరిశీలకుడు; తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ టిఓఎ సహకార్యదర్శి పరిశీలకుడు; స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్; రిటర్నింగ్ అధికారి దేవేందర్ సమక్షంలో జరిగాయి. ఎంపికైన హైదరాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు : గౌరవాధ్యక్షుడు బి.సుదర్శన్‌రెడ్డి; ప్రధాన కార్యదర్శి ఎస్.ఆర్.సంజీవ్‌కుమార్; కోశాధికారి కె. నర్సింహ; ఉపాధ్యక్షులుగా : సుధాకర్, జి.శ్రీనివాస్‌రెడ్డి, వంశీమోహన, రఫిక్‌లు; సహకార్యదర్శులుగా : ఎస్.శివకుమార్, శ్యాంరావు, రత్నాకర్, గమన యలవర్తులు; ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా గణేష్, రణధీర్, అఖిలరెడ్డి, బి.మౌనిక, పి.రమ్య, భగత్‌లాల్, రాజ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి - ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త

పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జీహెచ్ ఎంసీ కుత్బుల్లాపూర్, గాజుల రామారం సర్కిళ్లకు చెందిన ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ జీహెచ్ఎంసీ పరిధిలోని ఎనిమిది డివిజన్లలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంట సర్కిళ్ల పరిధిలో అన్ని డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు, ప్రహరీ గోడ నిర్మాణ పనులను చేపట్టేందుకు సర్కిల్‌కు 7 కోట్ల రూపాయల చొప్పున దాదాపు 14 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని వారు అధికారులకు తెలిపారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో వేలకోట్ల రూపాయల నిధులు వెచ్చించి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, ఇంకా అక్కడక్కడ మిగిలిపోయిన పనులను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని తెలియజేశారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి సామాన్య ప్రజలకు ఎటువంటి అసౌకర్యంగా కలగకుండా చూడాలని తద్వారా నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ నియోజకవర్గంగా నిలిపేందుకు అధికారులు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి పనిచేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఇంజనీరింగ్ ఈఈలు లక్ష్మీ గణేష్, డీఈ పాపమ్మ, శిరీష, రూపా దేవి, ఏఈలు కళ్యాణ్, తిరుపతి, అనురాగ్, అశోక్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు వెలగడం లేదని ఫిర్యాదు

జీడిమెట్ల, ఏప్రిల్ 15, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో సర్కిల్ ఉప కమిషనర్ నరసింహకి సుభాష్ నగర్ డివిజన్ ఎస్సార్ నాయక్ నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదని బిఆర్ఎస్ నాయకులు మాజీ ఏరియా కమిటీ సభ్యులు గుబ్బల లక్ష్మీనారాయణ, కాలనీ మాజీ అధ్యక్షుడు ఆలూరీ వెంకట శేషయ్యలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ నరసింహ వెంటనే వారి సిబ్బందితో మాట్లాడి గత కొన్ని రోజులుగా ఎందుకు వెలగడం లేదని అడిగి కారణాలు తెలుసుకున్నారు. ఇంకెప్పుడు లైట్లు వెలగటం లేదని ఫిర్యాదు రావద్దని వెంటనే వాటిని రిపేర్ చేయాలని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా లైట్లు వెలిగేటట్టు చూస్తానని సర్కిల్ ఉప కమిషనర్ నరసింహా హామీ ఇచ్చారు. అలాగే శానిటేషన్‌కు చెందిన పలు సమస్యలను పరిష్కరించాలని సర్కిల్ వైద్యాధికారి కవితని కోరడం జరిగింది.

దేశంలోనే మొదటిసారిగా రోబోటిక్ మోకాలి మార్పిడి

-డా.రవిచంద్ర వట్టిపల్లి

హైదరాబాద్, ఏప్రిల్ 15,ప్రభాతవార్త:

భారతదేశంలో మొట్టమొదటి రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సను రోబోటిక్ మోకాలు మార్పిడి సర్జన్, ఎస్‌జి ఆర్థోకేర్ వ్యవస్థాపకుడు డాక్టర్ రవిచంద్ర వట్టిపల్లి విజయవంతంగా నిర్వహించారు. ఈమేరకు మంగళవారం దీనికి సంబంధించిన విశేషాలను తెలియజేయటానికి సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఒక సమావేశం నిర్వహించారు.విశాఖపట్నంలోని కేర్‌లో అత్యంత సంక్లిష్టమైన ఈ కేసుకు విజయవంతంగా చికిత్స చేశామని తెలిపారు. 50 ఏళ్ల రోగికి అత్యంత సవాలుతో కూడిన వైద్య చరిత్ర ఉందని సాంప్రదాయపరంగా చూస్తే, అటువంటి కేసులకు 18 నెలల కాలంలో పలుమార్లు శస్త్రచికిత్సలు అవసరమవుతాయన్నారు. వీటిలో ఇంప్లాంట్ తొలగింపు, వైకల్య దిద్దుబాటు చివరికి కీళ్ల మార్పిడి వంటి శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉంటుంది. అయితే ఈ విధానాలు అనుసరించాల్సిన అవసరం లేకుండానే అధునాతన వెలిస్ రోబోటిక్ సిస్టమ్‌ను ఉపయోగించి రోగి వైకల్యాన్ని విజయవంతంగా సరిదిద్దామన్నారు. ఇప్పటికే ఉన్న ఇంప్లాంట్‌ను తొలగించాల్సిన అవసరం లేకుండా ఒకే ప్రక్రియలో మొత్తం మోకీలు మార్పిడిని నిర్వహించామని తెలిపారు. ఈసందర్భంగా శస్త్రచికిత్స చేసిన తీరును రవిచంద్ర ప్రదర్శించి ఉపయోగించిన అధునాతన పద్ధతులు, రోబోటిక్ సాంకేతికత యొక్క విప్లవాత్మక ప్రభావాన్ని వివరించారు. వైద్య చికిత్సలో ఇది ఒక ముఖ్యమైన పురోగతి అని ఆయన పేర్కొన్నారు.

దళితరత్న అవార్డు గ్రహీతలకు సన్మానం

అత్తాపూర్ ఏప్రిల్ 15,ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దళితరత్న అవార్డు గ్రహీతలను ఎన్నుకున్నారు. ప్రభుత్వం సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దళిత రత్న అవార్డులను పంబల రాజు, పత్యారా నరసింహలకు అందజేసి సత్కారించారు.మంగళవారం రాజేంద్రనగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళితరత్న అవార్డు అందుకున్న పంబల రాజు, పత్యారా నరసింహలను పలువురు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు గొడుగు సంజీవ, నార్సింగ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, పత్యారా రాజు, పచ్చ నర్సింగ్ రావు మంత్రి చంద్రశేఖర్ నవీన్, సుదీర్, కొత్తపల్లి, సంతోష్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో తెలుగు విశ్వవిద్యాలయంలో పీజి డిప్లమాగా అవధానం

- తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు

నాంపల్లి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : తెలుగుజాతికే సొంతమైన అవధానంను మరింత ప్రాచుర్యంలో తీసుకురావడానికి తెలుగు విశ్వవిద్యాలయ కోర్సుగా గుర్తించి విశ్వవిద్యాలయం ద్వారా త్వరలో పీజి డిప్లమా ప్రవేశపెట్టనున్నట్లు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు ప్రకటించారు. తెలుగు విశ్వవిద్యాలయం, ప్రజ-పద్యం, అవధాన విద్యావికాస పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లిలోని విశ్వవిద్యాలయ డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో 3రోజులపాటు దిగ్విజయంగా జరిగిన శతావధాన షడానన, పూర్ణచంద్ర డా. మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ సంపూర్ణ శతావధానం విజయోత్సవం సభలో ప్రసంగిస్తూ నిత్యానందరావు తెలిపారు. ఈమేరకు అవధాన విద్యా వ్యాప్తికి విశేషంగా కృషిచేస్తున్న అవధాన విద్యాపరిషత్, అధ్యక్షుడు మారుమాముల దత్తాత్రేయశర్మతో తెలుగు విశ్వవిద్యాలయం ఒక ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శతావధాని వెంకటరమణ పట్వర్ధన్, ఎం. దత్తాత్రేయశర్మ, ఎం.వెంకటరమణశర్మ, ఆచార్య కోట్ల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సభలో ప్రసంగిస్తున్న నిత్యానందరావు, హనుమంతరావు, దత్తాత్రేయశర్మ తదితర అతిథులు

బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలను విజయవంతం చేయాలి : కార్తిక్‌రెడ్డి

నార్సింగి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : ఈ నెల 27.వ,తేదీన వరంగల్ జిల్లాలో జరుపతలపెట్టిన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని ఇంచార్జి పి.కార్తిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బండ్లగూడ కార్పోరేషన్‌లో బిఆర్ఎస్ అధ్యక్షులు ఆర్.నాగరాజు నాయకత్వంలో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తిక్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పిడికెడు మందితో టిఆర్ఎస్ పార్టీని స్థాపించి, దేశంలోని పార్టీలన్నింటిని ఒప్పించి తెలంగాణ రాష్ట్రంను సాధించిపెట్టారన్నారు. జై తెలంగాణ అంటేనే పార్టీలు రాజకీయ నాయకులను పక్కన పెట్టేవని, సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇచ్చే వారు కాదని, మంత్రులను దించేసే వారన్నారు. అలాంటి సమయంలో ధైర్యం,సాహసం చేసి టిఆర్ఎస్ పార్టీని పెట్టి, తెలంగాణ బిడ్డలందరిని ఏకం చేసి ఉద్యమంగా ఉద్యమాన్ని నడిపారన్నారు. ఒక్క రక్తం చుక్కా కారకుండా, నీళ్లు, నిదులు, నియామకాలలో తెలంగాణ బిడ్డలకు జరుగుతున్న అన్యాయంను లెక్కలతో సహా వివరించి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను దేశ నాయకులకు వివరించారన్నారు. ఆమరణ దీక్ష చేసి, చావు అంచు వరకు వెళ్లి తెలంగాణ ప్రకటనను చేయించిన మహానేత కేసీఆర్ అని గుర్తు చేశారు. తెలంగాణను సాధించి, పదేళ్లపాటు సిఏంగా పని చేసి అన్ని రంగాల్లో రాష్ట్రంను అగ్రస్థానంలో నిలిపారన్నారు. 25.ఏళ్లలో రాష్ట్రం కోసం కేసీఆర్, టిఆర్ఎస్, బిఆర్ఎస్ చేసిన కృషిని గడప గడపకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందని కార్తిక్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాముడు యాదవ్, రవి కుమార్, నారాయణ, సుధాకర్ గౌడ్, వెంకటేష్, చంద్రశేఖర్, మహేష్, కీర్తికాంత, మహేందర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ జాగీర్ బిఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి కార్తిక్‌రెడ్డి.

పేదల కడుపు తీపిని తీర్చిన కారణజన్ముడు రేవంత్ రెడ్డి : కూన శ్రీశైలం గౌడ్

సహపంక్తి భోజనం చేస్తున్న కూన శ్రీశైలం గౌడ్

జీడిమెట్ల, ఏప్రిల్ 15, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని 125 డివిజన్ లెనిన్ నగర్‌లో సన్నబియ్యం లబ్దిదారులు లక్ష్మమ్మ భాస్కర్ దళిత కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ వారి కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం లబ్దిదారుని ఇంట్లో డా. బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించి, లక్ష్మమ్మ కుటుంబానికి ప్రభుత్వం నుండి ఎన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం లబ్దిదారుని ఇంట్లో మధ్యాహ్న భోజనం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, బుచ్చిరెడ్డి, రషీద్ బేగ్, రాజిరెడ్డి, రామ్ నర్సయ్య, రామిరెడ్డి,శ్రీనివాస్, నాగరాజు, శ్రీదేవి, చంద్రవతి, లత, రవి, మధు, సంతోష్, సతీష్, లాల్ మహమ్మద్, రవీందర్ రెడ్డి, వెంకట్ రాజు, రవి చారి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన సత్యం శ్రీరంగం

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 14, ప్రభాతవార్త

కొత్త ప్రభాకర్ రెడ్డి మాటల వెనుక కుట్ర కోణం ఉందిదీనిపై వెంటనే విచారణ జరిపించాలనీ టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం డిమాండ్ చేశారు. రియల్ ఎస్టేట్ కంపెనీలు తెలంగాణ ప్రభుత్వాన్ని కూల్చడానికి సిద్ధంగా ఉన్నాయి. ఎమ్మెల్యేలను కొనడానికి ఎంత డబ్బు అయిన ఖర్చుపెట్టడానికి పారిశ్రామిక వేత్తలు మమల్ని కలుస్తున్నారు, తెలంగాణ ప్రభుత్వాన్ని ఎక్కువ కాలం నిలబడదు, త్వరలోనే కూల్చబోతున్నాం అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ అధికారం పోయిందన్న అహంకారంతో కల్వకుంట్ల కుటుంబానికి కడుపు మండుతుందని అన్నారు. ప్రజలతో ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూలగొట్టే నైతిక హక్కు, రాజ్యాంగాన్ని ఖుని చేసే హక్కు ఎక్కడిదని ఇది పూర్తిగా రాజ్యాంగ విరుధంగా మాట్లాడినా మాటలు అని అన్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డి మాటల వెనుక కుట్ర కోణం ఉందనీ కేసీఆర్ ఫార్మ్ హౌస్‌లో పడుకొని ఇవాళ ప్రజాప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డి సర్కార్‌ని కూలదోయడానికి కుట్రలు చేస్తున్నార నీ దుయ్యబట్టారు. కేసీఆర్ ఆత్మ అయినటువంటి కొత్త ప్రభాకర్ రెడ్డితో మాట్లాడించిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా అన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలనీ సత్యం శ్రీరంగం అన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిన డానియేల్

గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ సర్టిఫికేట్లతో డానియేల్ ఆంధ్రా

సైఫాబాద్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: హైదరాబాద్ జిల్లాకు చెందిన డానియేల్ ఆంధ్రా జగడం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సాధించారు. నగరంలోని హల్లెల్ మ్యూజిక్ స్కూల్‌లో గత డిసెంబరు మాసంలో జరిగిన మ్యూజిక్ విభాగంలో కీబోర్డు ఇనుస్ట్రుమెంట్ వాయిస్తూ మూడు స్వరాలను 45 సెకండ్లలో పాడి రికార్డు సృష్టించారు. దీంతో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సరిఫికేట్లలను ఆ సంస్థ ప్రతినిధులు ఆయనకు అందజేశారు.

తెలుగుభాషా ప్రాభవానికి మండలి కృషి చిరస్మరణీయం : భవానీ ప్రసాద్

మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవ క్యాలెండరును ఆవిష్కరిస్తున్న జస్టిస్ భవానీప్రసాద్, కొలకలూరి ఇనాక్, వెంకటేశ్వరరావు, రఘురామ్ తదితర అతిథులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల సూత్రధారి మండలి వెంకట కృష్ణారావు తెలుగుభాషా ప్రాభవానికి చేసిన అశేషకృషి చిరస్మరణీయమని ఏపి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవానీ ప్రసాద్ అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 70ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ సభలో నాటి విద్యాశాఖ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవ క్యాలెండరు ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఆచార్య కొలకలూరి ఇనాక్ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ భవానీ ప్రసాద్ విశిష్ట అతిథులు సారిపల్లి కొండలరావు, డా. ఎల్లా వెంకటేశ్వరరావు, ఆచార్య టి.గౌరీశంకర్, డా. గంధం సుబ్బారావు, కిన్నెర రఘురామ్ తదితరులతో కలిసి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవ క్యాలెండర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు.

వైద్యం వికటించి మహిళ మృతి చెందిన కేసులో డాక్టర్ అరెస్ట్..

కొంపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త

సరైన వైద్యం చేయడం తెలియక రోగి మృతికి కారకుడైన డాక్టర్‌ను బాచుపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం గత సంవత్సరం జూలైలో బాచుపల్లిలోని స్థానిక ఎస్ఎల్‌జి ఆసుపత్రిలో సరస్వతి (43) అను మహిళ చికిత్స కొరకు ఆసుపత్రిలో చేరింది. ఆమెకు డాక్టర్ ఎస్.సతీష్ కుమార్ ఎస్ఎల్‌జి ఆస్పత్రిలో పనిచేసే వైద్యుడు సరైన చికిత్స చేయకపోవడంతో ఆమె మరణించింది. దీంతో సరస్వతి కుమారుడు పోలీసులకు ఈ విషయమై ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు పిఎంఈ వైద్య పరీక్షల కోసం సిఫారసు చేశారు. పీఎంఈ వైద్య పరీక్షలో డాక్టర్ నిరక్ష్యం కారణంగానే చికిత్స చేయడం, అతనికి సరిగా తెలువకపోవడం కారణంగానే రోగి సరస్వతి మృతి చెందినట్లు పిఎంఈ వైద్య పరీక్షలో తేలింది. దీంతో రోగి మృతికి కారకుడైన ఎస్ఎల్‌జి ఆసుపత్రి డాక్టర్ ఎస్.సతీష్ కుమార్‌ను బాచుపల్లి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వైద్యం సరిగా చేయడం రాని వైద్యులను నియమించుకొని రోగి మృతికి పరోక్షంగా కారకులైన ఎస్ఎల్‌జి ఆసుపత్రి యాజమాన్యంపై కూడా బాచుపల్లి పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

20న రైల్వే ఉద్యోగాలు సాధించడానికి ఉచిత శిక్షణకు రాత పరీక్ష

హైదరాబాద్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త

రైల్వేలో ఉద్యోగాలు సాధించడానికి కావల్సిన శిక్షణను పరవస్తూ క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ గ్రీన్లాండ్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందిం చనున్నారు. రైల్వేలో ఉద్యోగం పొందడానికి 3 నుంచి 4 నెలల పాటు అన్ని విధాల శిక్షణను నిరుద్యోగ యువతకు ఇవ్వనున్న ట్లు సంస్థల ప్రతినిధులు గద్దె భాస్కర్, మువ్వరాంరెడ్డి, ప్రొఫె సర్ లక్ష్మీకుమారిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ పొందే నిరుద్యోగ యువతకు వచ్చే ఈ నెల 20వ తేదిన అర్హత పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన నిరుద్యోగులకు ఉచిత భోజనం, వసతి, కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. శ్రీధర్ సీసీఈ ఇనిస్టి ట్యూట్ సహకారంతో ఉత్తమ శిక్షణ అందిస్తామన్నారు. రెండు తెలుగు రాష్ట్రల్లోని వివిధ నగరాల్లో అర్హత రాత పరీక్షను నిర్వ హించడం జరుగుతుందన్నారు. అర్హత పరీక్షకు హాజరు కావాల్సి న వారు ముందుస్తుగా తమ పేర్లను ఈ నెల 17వ తేది లోపు నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు పరవస్తు క్రియే టివ్ ఫౌండేషన్ ఫేస్బుక్ పేజీ సంప్రదించవచ్చన్నారు.

హిందూ కోడ్ బిల్లు పున్నరుద్ధరింపచేస్తేనే అంబేడ్కర్‌కు ఇచ్చే ఘనమైన నివాళి

చిక్కడపల్లి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: ఒక్క దళితులకే కాదు శ్రామికులకు కూడా చైతన్యవంతమైన జీవితం ఉండాలన్న ప్రణాళికలను రూపొందించిన మహనీయుడు భారతరత్న బి.ఆర్. అంబెడ్కర్ అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో అధ్యక్షుడు కళా వి.ఎస్.జనార్దన మూర్తి అధ్యక్షతన ప్రముఖ రచయిత జయసూర్య రచించిన భారతరత్న బాబాసాహేబ్ బి.ఆర్.అంబెడ్కర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కొలకలూరి ఇనాక్ పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు.అంబెడ్కర్ కేవలం దళితుల పక్షపాతి అని అనుకుంటారని కానీ భారతీయులలో చైతన్య తీసుకురావడానికి జనం మొత్తాన్ని ప్రేమించిన వ్యక్తిగా ఆయనను గుర్తుంచుకోవాలని అన్నారు. మనిషిని ప్రేమించాడని, ఉన్నవాడు ఉన్నచోట కాకుండా ఉన్నంతంగా ఎదగాలని ఆకాక్షించారని, అంత అద్భుతమైన వ్యక్తిని అర్థం చేసుకోవడంలో ప్రజలు కూడా ఇబ్బందులు పడ్డ సందర్భాలు కూడా ఉన్నాయని అన్నారు. రాజ్యాంగాన్ని ఏర్పరిచిన తరువాత ఇందులో మార్పులు వచ్చిన తరువాత భవిష్యత్తు బాగుండడానికి వీలైనంత తొందరగా దేశం మొత్తం చైతన్యవంతం కావాలని ఆశపడ్డ వ్యక్తి అంబెడ్కర్ అని కొనియాడారు. అంబెడ్కర్ నిజమైన నివాళి ఇవ్వాలంటే 1951 సంవత్సరం లో నాడు న్యాయశాఖ మంత్రిగా ఉన్న సమయంలో స్త్రీలకు మేలు చేసే హిందూ కోడ్ బిల్లు కు ఆమోదం పొందకపోవడమేనని, ఆ బిల్లుకు పాలకులు తిరిగి నిర్జీవంగా పంపడం జరిగిందని ఆ బిల్లుకు తిరిగి ప్రాణం పోస్తేనే ఆయనకు నిమయిన నివాళి అని అన్నారు. అంబెడ్కర్ అనే వ్యక్తి దేశంలో జన్మించి ఉండకపోతే ఈ దేశం నూరేళ్లలో సంపన్నమైన దేశం అయ్యేది కాదని, ఆ మహానుభావుడి వల్లే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘసేవకులు భవాని శ్రీనివాస్, కోళ్ల సుధాకర్, పాత శివ కుమార్, వీణాపాణి దితరులు పాల్గొన్నారు.

ప్రముఖ రచయిత జయసూర్య రచించిన భారతరత్న బాబాసాహేబ్ బి.ఆర్.అంబెడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్, చిత్రంలో కళావిఎస్.జనార్దనమూర్తి తదితరులు

మాల మహానాడు క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

చిక్కడపల్లి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు మాల సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ గోపోజు రమేష్ బాబు రూపొందించిన మాల మహానాడు నూతన సంవత్సర క్యాలెండరణ సభ మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా చెన్నూరు శాసనసభ్యులు వివేక్ వెంకటస్వామి హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు. భారతదేశానికి ఇంత గొప్ప రాజ్యాంగాన్ని అందించిన బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలని, అంబేద్కర్ వాదాన్ని నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గోపోజు రమేష్ బాబు మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుందన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పించారని, ఓసి,బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలకు రిజర్వేషన్లు కల్పనకు కృషి చేశారన్నారు. ఆ మహనీయుడి జయంతిని రాష్ట్రం అంతట అన్ని వర్గాల ప్రజలు ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు కొండ్ర రాజలింగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వలికి కృష్ణమూర్తి రాష్ట్ర కార్యదర్శి ఎన్నమల్ల శ్రీకాంత్ తాలూకా అనిల్ చేతన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిస్ అండ్ మిసెస్ సీజన్ 2 పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్,ఏప్రిల్ 15,ప్రభాతవార్త:

హైదరాబాద్ వేదికగా ఇటీవలే నిర్వహించిన మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటీఫుల్ ఈవెంట్ విజయవంతం కావడంతో సక్సెస్ మీట్ నిర్వహించారు. దీనిలో భాగంగా మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటీఫుల్ సీజన్ 2ను ప్రకటించారు. రెండో సీజన్ కు సంబంధించిన పోస్టర్

పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం అందించాలి

పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

షాద్‌నగర్,ప్రభాతవార్త,ఏప్రిల్ 15: పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో షబానా బేగంఅన్నారు.పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా లింగారెడ్డిగూడ గ్రామంలోని అంగన్‌వాడీ 2వ కేంద్రంలో టీచర్ అమృత ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు సరైనపౌష్టికాహారం అందించాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో సూపం ్‌వైజర్ జయలక్ష్మీ, గ్రామపంచాయతీ కార్యదర్శి అర్జున్ కుమార్, ఆశాకార్యకర్తలు సరళ, మహిళాసంఘం అధ్యక్షురాలు జి.మాధవి,బి. మంగమ్మ ,మహిళా సంఘం సభ్యులు,అంగన్‌వాడీఆయా కృష్ణమ్మ పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు, ప్రభాతవార్త, ఏప్రిల్ 15 : చిన్నారి బాలబాలికల మానసిక, శారీరక ఎదుగుదలకు పౌష్టికాహారం తినిపించడం ఎంతో అవసరమని శిశు సంక్షేమ శాఖ షాద్‌నగర్ సీడీపీవో షబానా బేగం అన్నారు. మంగళవారం కొందుర్గు గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన పౌష్టిక మాసం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పౌష్టికాహార విలువలపై అవగాహన కల్పించారు. అక్కడే గర్భవతులకు సమూహిక సీమంతం, చిన్నారులకుఅక్షరాభ్యాసకార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీ అనురాధ, ఏపీఎం జయమాలిని, పంచా యతీకార్యదర్శి సురేఖ, ఏఎన్ఎం సుజన, అంగన్‌వాడీ టీచర్లు భాగ్యమ్మ, మాణెమ్మ, రజియా బేగం, నాగమణి, ప్రేమలత, శ్రీలత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్ వైజర్ గీత

జిల్లేడుచౌదరిగూడ,ఏప్రిల్ 15,ప్రభాతవార్త: గర్భిణులు చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ గీత అన్నారు.మంగళవారంజిల్లెడు చౌదరిగూడ మండలంలోని చింతకుంట తాండా అంగన్వాడీ కేంద్రంలోపోషణపక్షం కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలు, పోషకాలు ఉప యోగం గురించి గర్భిణీ స్త్రీలు,బాలింతలకు తెలియ చేశారు. రక్తహీనతతో ఎవరు ఇబ్బంది పడకుడదన్నారు. అంగన్‌వాడి కేంద్రాలలో అందించే పోషకాహారాన్నితీసుకోని రోగనిరోధక శక్తిని పెంచుకోవాలని తెలిపారు. అంగన్‌వాడి టీచర్లువసంత ,సోనా, పుష్ప, బాలింతలు,గర్భిణీలు పాల్గొన్నారు

షటిల్ టోర్నీ విజేత

ఆమనగల్లు ఏప్రిల్ 15, ప్రభాతవార్త: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి పురష్కరించుకుని ఆమనగల్లు పట్టణంలో నిర్వహించిన మండల స్థాయి షటిల్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. బుధవారం ఉదయం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆమనగల్లు పట్టణానికి చెందిన అబా జట్టు క్రీడాకారులు కృష్ణానాయక్, కొట్ర మల్లేశ్‌లు వ టోర్నీ విజేతగా నిలిచారు. డబల్ విభాగంలో జరిగిన షటిల్ టోర్నమెంట్‌లో 10జట్లు పాల్గొన్నాయి. ఎంగలి ప్రసాద్, జీకే తిరుపతిలతో తుది పోరులో తలపడి మంచి ప్రదర్శన చేసిన అబా టీం క్రీడాకారులు కృష్ణా నాయక్, కొట్ర మల్లేష్ లు టోర్నీ విజేతలుగా నిలిచారు. అలాగే తృతీయ స్థానంలో వేణు, జగన్ జెఎన్‌టీంనిలిచింది.కాగాముగింపుసంధర్భంగావిజేతలకు షీల్డు బహు మతులను నిర్వహకులు ఏబీఏ అసోషియేషన్ అధ్యక్షుడు కృష్ణానాయక్, ప్రధానకార్యదర్శిమల్లేశ్‌లుఅందజేశారు. జి.వెంకటేశ్,పర్వతాలు, వెంకటేశ్, తిరుపతి, ఎంగలి ప్రసాద్, రవి, జంగయ్య, జగన్,వేణు, మన్న గిరి, ఏలె శివకుమార్, వేణు, దేవేందర్, పవన్, శ్రీకాంత్ ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

సదాశివపేట, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: అగ్నిప్రమాదాల నివారణపై తీసు కోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపకశాఖ అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో, జ్యోతి, మహేశ్వరి సినిమా థియేటర్ పరిసరాల్లో, కాసం షాపింగ్ మాల్‌లో అగ్ని ప్రమాదాలు జరుగకుండా, ప్రమాదాలు చోటు చేసుకుంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి ఎస్ బిక్షపతి, సిబ్బంది ఆర్ రవికుమార్, టి శ్రీశైలం, ఎం రాజ్‌కుమార్, జె రవీందర్‌లు ఉన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంపిడిఓ

మునిపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: మండల కేంద్రమైన మునిపల్లిలో గ్రామానికి చెందిన నరేష్ ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని మంగళవారం మండల అభివృద్ధి అధికారి హరినందనరిందనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ హరినందనరావు మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం ఆయా గ్రామాల నుంచి నిత్యం ప్రజలు వస్తూ ఉంటారని, వేసవి కాలం కావడంతో దప్పిక అవుతుందని, చల్లని మంచినీటి కోసం ప్రజలు ఎదురుచూస్తారని, అలాంటి వారి కోసం చల్లని తాగునీరు అందించే చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని నరేష్‌ను కొనియాడారు.

కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం జిల్లా కార్యదర్శి ఏ పరమేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ రమేష్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు మహేందర్, తక్కడపల్లి సంగమేశ్వర్, బాలు, నవీన్, ప్రకాష్, పంచాయితీ కార్యదర్శి రాజ్‌కుమార్, రాము, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను తప్పకుండా నెరవేరుస్తాం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి ఏప్రిల్15,ప్రభాతవార్త;

తెలంగాణరాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యేకసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళ వారం తలకొండపల్లి మండలంలోనీ వెంకటాపూర్ తండాలో జై బాబు, జై భీమ్,జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దోకురి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈకార్యక్రమాన్ని కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలతోకలిసివెంకటాపూర్‌తాండ, వెంకటాపూర్, పెద్దూర్ తాండ,దేవునిపడకల్,పడకల్,లింగరాపల్లి గ్రామాలలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చినహామీల మేరకు ప్రతిఒక్కసంక్షేమఅభివృద్ధి కార్యక్రమాలను పూర్తిస్థాయిలో నెరవేర్చుతామని,రైతుబంధు,ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువశక్తి ద్వారా స్వయం ఉపాధి రుణాలు ఇస్తామని ఆయన తెలిపారు. అనంతరం పడకల్ గ్రామంలో సింగల్‌విండో ఆధ్వర్యంలో పొద్దుతిరుగుడు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి జోగు రమేష్, దేవుని పడకల్ మాజీ సర్పంచ్ శ్రీశైలం, రవీందర్, అజీమ్, శ్రీశైలం



కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

డేవిడ్, కృష్ణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

70వ రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: మండల పరిధిలోని ప్యారానగర్, నల్లవల్లి ప్రాంతాలలో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ (ఎంఎస్‌డబ్ల్యూ) నిర్మాణా నికి వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో 70వ రోజుకు చేరుకున్నాయి. గుమ్మడిదలలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద, నల్లవల్లి గ్రామంలో దీక్షలు కొనసాగుతున్నాయి. స్థానిక ప్రజలు, రైతులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున ఈ దీక్షల్లో పాల్గొంటూ నిరసనను తెలుపుతున్నారు. రిలే నిరాహార దీక్షలో అనంతరం గ్రామ యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, కుమార్‌గౌడ్, సదానంద రెడ్డి, మొగులయ్య, శ్రీనివాస్, మద్ది బాల్‌రెడ్డి, మోహన్ రెడ్డి, జె. బాల్‌రెడ్డి, బిక్షపతిరెడ్డి, యాదిరెడ్డి, గోపాల్, సూర్యనారాయణ, యాదయ్య, రాజు, రామిరెడ్డి, పెంటయ్య, మహేష్, వెంకటేష్, నర్సింగ్ రావు, ప్రవీణ్, సాయికుమార్, దుర్గయ్య, శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

పోచమ్మ తల్లికి బోనాల జాతర

అల్లాదుర్గం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: మండల కేంద్రంలో శ్రీ భేతాళ స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పోచమ్మ తల్లికి బోనాలను డప్పు చప్పుళ్లతో డోలు వాయిద్యాల నడుమ, బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారిని నైవేద్యంగా సమర్పించారు. గ్రామంలోని ఆయా ఇండ్ల నుంచి మహిళలు బోనాల ఎత్తుకుని సామూహికంగా గోవింద నామస్మరణతో ఆలయానికి చేరుకున్నారు. యువకులు, శివసత్తుల వారు నృత్యాలు చేస్తుండగా కొనసాగిన బోనాల ఊరేగింపు భక్తి పారవశ్యంతో కొన సాగింది. బోనాలతో ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయం చుట్టూ 5 ప్రద క్షిణలు చేసి అమ్మవారికి బోనాలను సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. బోనాల ఊరేగింపు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగేలా ఆలయకమిటి బాధ్యులు తగు చర్యలు తీసుకోగా పోలీసులు బందోబస్తును నిర్వహించారు.

పటాన్ చెరులో 272 చెక్కుల పంపిణీ

పటాన్‌చెరు, ఏప్రిల్ 15,ప్రభాతవార్త: కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలు నేడు నిరుపేదలకు వరంగా మారాయని శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యా లయంలో 272 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన రెండు కోట్ల 72 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్, జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ ప్రభాకర్, మాజీ జడ్పిటిసిలు సుధాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేవానంద్, వెంకట్ రెడ్డి, షేక్ హుస్సేన్, ఆయా మండలాల తహసిల్దార్లు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న స్వామి ఉత్సవాలు

హవేలీఘనపూర్, ఏప్రిల్ 15,ప్రభాతవార్త: మండల పరిధి ఔరంగబాద్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మల్లన్న స్వామి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యాదవ సంఘం సభ్యులు మల్లన్నకు నాగేల్లి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జెన్‌టియులో టెక్నికల్ 2k25 పెస్ట్

చౌటకూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవాలను పురష్కరించుకుని ప్రతి సంవత్సరం నిర్వహించే 13వ టెక్నికల్ 2k25 పెస్ట్ ఉత్సవాలను మంగళ వారం ప్రారంభం అయ్యాయి. ప్రిన్సిపాల్ నరసింహ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయా విభాగాలకు సంబంధించిన ఇన్నోవేషన్‌ను ప్రారంభిం చారు. మూడు రోజుల పాటు కొనసాగే కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు విద్యార్థులు ప్రాజెక్టుల రూపంలో తీయరు చేసి ప్రదర్శించనున్నారు. సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఎర్త్‌క్విక్ రెసిస్టెంట్ బిల్డింగ్ దాని పనితీరు, భూకంపాలకు సంబవించినప్పుడు భవనాలు ఎలా తట్టుకోవాలో అవిష్కరణలో ప్రదర్శించారు.

ఈ నెల 16, 17 తేదీలలో పలు ఈవెంట్‌లు జరుగనున్నాయి. ఈనెల17న ఫెస్ట్ ఉత్సవాల ముగింపును పురష్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, ఆయా విభాగాధిపతులు, సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ డిపార్టుమెంట్ అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కొండాపూర్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: మండల పరిధిలోని అనంతసాగర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అంగన్‌వాడీ నాలుగు కేంద్రాల చిన్నారు లకు యానివల్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతసాగర్ మాజీ ఉప సర్పంచి ఇంద్రారెడ్డి చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందించారు. నేటి బాలలే రేపటి బావి పౌరులని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్‌లు సునంద, అరుణ, నాగరేఖ, సరిత, మాజీ విద్యా కమిటీ చైర్మన్ రామకృష్ణ, అంగన్‌వాడీ ఆయాలు ఉన్నారు.

వీరభద్రేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

న్యాల్‌కల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: మండల పరిధిలోని మరియంపూర్ గ్రామంలోగల శ్రీవీరభద్రేశ్వరస్వామి జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనం గా కొనసాగుతున్నాయి. జాతర ఉత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆలయానికి చేరుకోగా ఆలయ కమిటీ అధ్యక్షులు, సభ్యులు స్వాగతం పలికి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మున్నూర్ రవీందర్, మాజీ మండల అధ్యక్షులు ఎల్‌చెల్ నర్సింహారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షులు రవికుమార్, మాజీ సర్పంచ్ రాజు పాటిల్, మల్‌రెడ్డి, నాయకులు మిథున్‌రాజ్, లోకేష్ పాటిల్, అశోక్ పాటిల్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దేవిదాస్‌ను పరామర్శించిన చంద్రశేఖర్‌రెడ్డి

కంగ్టి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఎన్కెమూరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవిదాస్ కుమారుడు అనా రాగ్యంతో హైదరాబాద్ మదీనాగూడలోని అర్చన అసుపత్రిలో చికిత్స అందుకుంటున్నట్లు తెలుసుకుని మంగళవారం డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు. దేవిదాస్ కుమారుడి ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రి డాక్టర్లను అడిగి తెలుసుకుని మెరుగైన చికిత్స అందచేయాలని డాక్టర్లకు చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. అండగా ఉంటామని దేవిదాస్‌కు చంద్రశేఖర్‌రెడ్డి భరోసా కల్పించారు. చంద్రశేఖర్‌రెడ్డి వెంట అంజప్ప, శరణప్ప పవన్ తదితరులు ఉన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ

మునిపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 44 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం ఏఎంసి చైర్మన్ మంతురి సుధాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిల్లోడి సతీష్‌ల ఆధ్వర్యంలో పంపిణి కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాభవాని, మాజీ ఎంపిపి అధ్య క్షులు రాంరెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు పాండు, కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

నర్సాపూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడు తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు బిజెపి మండల అధ్యక్షుడు నీలి నాగేష్ అన్నారు.మంగళవారం లింగాపూర్‌లో గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు కేంద్ర ప్రభుత్వ అభి వృద్ధి పనుల, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అంతేగాక స్వచ్ఛభారత్ నిర్వహించి పలు వీధుల్లో శుభ్రం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకిచ్చే ఆహార పదార్థాల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు మంచి పౌష్టికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. ఈ సందర్భం గా బిజెపి మండల అధ్యక్షుడు నీలి నాగేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందరూ తెలుసు కోవాలన్నారు. కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బోయిని రాజు, నాయకులు గుండం శంకర్, బూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ వార్డు సభ్యులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో బోర్లు వేయించిన ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: పట్టణంలోని కాలనీల్లో నెలకొన్న నీటి సమస్యలను పరిష్కరించేందుకు జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్లమెంట్ నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డి తన సొంత నిధులతో బోర్‌లను డ్రిల్ చేయించారు. పట్టణంలోని రాంనగర్‌లో 2, గాంధీనగర్‌లో 1 బోరును వేయించారు. ఆయా కాలనీల్లో బోర్లు డిల్ర్ చేసేందుకు ఉజ్వల్ రెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉజ్వల్‌రెడ్డి తన సొంత నిధుల తో ప్రజలు కష్టాలు పడకుండా ఉండేందుకు బోర్లు డ్రిల్ చేయిండం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి నరసింహా రెడ్డి, కే భీమయ్య, జమ హర్షద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సదాశివపేట, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే చింత ప్రభాకర్; టిజి ఐఐసి చైర్మన్ తూర్పు నిర్మిల జగ్గారెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమం లో సిడిసి చైర్మన్ గడీల రాంరెడ్డి, సొసైటీ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, డైరెక్టర్లు విఠల్‌రెడ్డి,శేఖర్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన్న, ఆయా గ్రామాల మాజీ ప్రజా ప్రతి నిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బొక్కస్‌గాం సొసైటీ కార్యాలయంలో...

సిర్గాపూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

మండల పరిధిలోని బొక్కస్‌గాం సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగలవారం డిసిసిబి డైరెక్టర్, సొసైటీ చైర్మన్ గుండు వెంకటరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటరాములు మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన వరి ధాన్యంను మధ్య దళారులకు అమ్ముకుని ఆగం కావొద్దని, కొనుగోలు కేంద్రంకు తరలించి ఆర్థికంగా లబ్ధిపొందాలని మండల రైతులకు సూచించారు. కార్యక్రమలో రైతులు జూర సంగారెడ్డి, బాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాంరెడ్డి, కార్యాలయసిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ జైబాపు జైభీమ్ జైసంవిధాన్ ర్యాలీ

ఘట్‌కేసర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేశ్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఘట్‌కేసర్ పట్టణంలో జరిగిన జైబాపు జైభీమ్ జైసంవిధాన్ అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐసీసీ పిలుపు మేరకు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి ఎదులాబాద్ రోడ్డు మీదుగా గ్రంథాలయ భవనం వరకు అవగాహన ర్యాలీ జరిపారు.

నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ జెండాలు చేతబూని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ పాదయాత్ర చేశారు. ఈసందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్, జాతా పిత మహాత్మా గాంధీ విగ్రహాలకు నాయకులు పూలమాళలు వేసి నివాళులు అర్పించారు. వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ ఏఐసీసీ ఆదేశాల మేరకు జైబాపు జైభీమ్ జైసంవిధాన్ అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, మాజీ సర్పంచులు అబ్బసాని యాదగిరియాదవ్, మెడబోయిన వెంకటేశ్, పిసిసి మాజీ కార్యదర్శి కట్టా జనార్దన్‌రెడ్డి, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మాజీ కౌన్సిలర్లు కడుపొల్ల మల్లేశ్, కుతాడి రవీందర్, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు

అవగాహన ర్యాలీలో పాల్గొన్న వజ్రేశ్‌యాదవ్, మహేశ్‌గౌడ్, పావని తదితరులు

కొరుబోతు నాగరాజు,వాజీద్,మాజీవార్డుసభ్యులు బొక్కప్రభాకర్‌రెడ్డి, విబి. వెంకటనారాయణ,బర్లదేవేందర్,మామిండ్లచిత్తారీయాదవ్,మీసాల సుధాకర్ రావు, మేడ్చల్ ఎస్‌టీ సెల్ అధ్యక్షులు నానావత్ సురేశ్‌నాయక్, మైనారిటీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు ఆశ్రఫ్‌ఆలీ, మున్సిపల్ అధ్యక్షులు ఎంఎ. ఫారూఖ్, ఎస్‌సీ సెల్ అధ్యక్షులు మోత్కుపల్లి శ్రీనివాస్,నాయకులు కందకట్ల మాధవరెడ్డి, అబ్దుల్‌ఖయ్యూమ్, మామిండ్లకార్తీక్‌యాదవ్, రాజారత్నం, రఫీయుద్దిన్, కె.నర్సింగ్‌రావు, సిరాజుద్దిన్, శివరాత్రి సురేశ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే

లింగారెడ్డిగూడలో అంగన్‌వాడీ గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు

షాద్‌నగర్, ప్రభాతవార్త,ఏప్రిల్15: ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్ 1 లో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం అంగన్‌వాడీ టీచర్ కె.మంజుల ఆధ్వర్యంలోచిన్నారులుఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్నారు.ఈసందర్భంగాచిన్నారులతో కేక్ కట్ చేయించారు. అనంతరం పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు, గర్భిణీలకు, కిషోర బాలికలకు పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఆహార సమతుల్యత, పరిశుభ్రత వంటి అంశాలతో పాటు ప్రీ స్కూల్ గురించి అంగన్‌వాడీ టీచర్ వివరించారు. పోషకాహారంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాధవి, పంచాయతీ కార్యదర్శి అర్జున్, మాజీ వార్డు సభ్యులు రంగంపల్లి సురేష్ గౌడ్,రంగంపల్లి రమేష్ గౌడ్, చీపిరి గణేష్ యాదవ్, పయ్యల కృష్ణ యాదవ్,మంగలి మల్లేష్, శంకరయ్య యాదవ్, ఏఎన్ఎం నిర్మల, ఆశా వర్కర్లు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గర్భిణీ,బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి



చౌడాపూర్,ఏప్రిల్15ప్రభాతవార్త: చౌడాపూర్‌మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రంలో బాలింతలు, గర్భిణీలకు పోషణపక్వాడ్ కార్యక్రమం ద్వారా అధికారులు అవగాహన కల్పించారు. ఆకుకూరలు కూరగాయలు, పండ్లను తీస్కోవటం వలన తల్లి,బిడ్డ ఆరోగ్యకర

నర్సప్పగూడలో గీత ప్రవచనం

నందిగామ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

సమస్త మానవాళి శ్రేయస్సుకోసం సర్వజాతులకు సర్వకాలాలకు వర్తించే విధంగా నర్సప్పగూడలో గీతాప్రవచనం నిర్వహిస్తున్నట్లు వై.బాలచంద్ర తెలిపారు. కురుక్షేత్ర సంగ్రామంలో జగద్గురువైన శ్రీకృష్ణుడు అర్జునునికి చేసిన జ్ఞానబోధ భగవద్గీత అన్నారు. సర్వ ఉపనిషత్తుల సారమైన ఈ భగవద్గీత 18 అధ్యాయాల రూపంలో ప్రజలకు మేలుకొలుపు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళలు కుటుంబాలనే పోషించే స్థాయికి..

-డిపియంలు నర్సిములు, వీరయ్య

నూతన కార్యవర్గానికి హాజరైన డ్వాక్రా మహిళాసంఘాలు

కోట్‌పల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

డ్వాక్రా మహిళలు కుటుంబాలనే పోషించే స్థాయికి ఎదిగారని వికారాబాద్ జిల్లా డిపియంలు నర్సిములు, వీరయ్య అన్నారు. మంగళవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో మహిళాసమైఖ్య ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఇందులో అన్నిగ్రామాల సంఘాల మహిళలు అధ్యక్షులుగా 12మంది హాజరయ్యారని ఇందులో సభ్యులనుండి ముగ్గురిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. మండల మహిళాసమైఖ్య అధ్యక్షురాలిగా రాంపూర్ గ్రామానికి చెందిన వసంత, కరీంపూర్ గ్రామానికి చెందిన దేవమ్మ, మండల మహిళాకార్యదర్శిగా, కంకణాలపల్లి గ్రామానికి చెందిన వెంకటమ్మ, కోశాధికారిగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈఎన్నికల అధికారిగా డిపియం వీరయ్య ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించి వారిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈసందర్భంగా డిపియంలు నర్సిములు, వీరయ్యలు మాట్లాడుతూ, డ్వాక్రామహిళలు కుటుంబాలే పోషించే స్థాయికి ఎదిగారన్నారు. గ్రామాలే కాకుండా పట్టణాల్లోనూ కూడా మహిళా సంఘాలు ఏర్పాటుచేశారన్నారు.ఇందిరా మహిళాశక్తిపథకంద్వారా స్వయం ఉపాధి పనులు చేసుకునేందుకు మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా జీరో వడ్డీకే రుణాలు కల్పిస్తున్నారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపియం శివయ్య, సిసిలు గణేష్, భీమ్లానాయక్, సంజీవ్, హన్మంతురెడ్డి, సునీత, అంబుజ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ నేత ఇంటికి ఎమ్మార్పీఎస్ ఉద్యమయోధుడు

-బిఆర్ఎస్ సీనియర్ నేతతో మాటామంతి

చేగూరులో విఠల్‌ను కలిసిన మందకృష్ణ మాదిగ

నందిగామ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

ఎస్సీ వర్గీకరణ పోరులో సుప్రీంకోర్టు తీర్పు ద్వారా కేంద్రం మెడలు వంచి విజయంసాధించి దేశంలోనే సంచలనం సృష్టించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ రంగారెడ్డిజిల్లా నందిగామ మండలం చేగూరు గ్రామాన్ని సందర్శించారు. చేగూరు బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ సింగిల్ విండో చైర్మన్ విఠల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఇంట్లో తేనీటివిందు అనంతరం వారిరువురు కాసేపు ప్రస్తుత రాజకీయ, సామాజిక, ఆర్థిక, భౌగోళిక స్థితిగతులపై మాట్లాడినట్టు తెలిసింది. ఏది ఏమైనా బిఆర్ఎస్ సీనియర్ నేత ఇంట్లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పెద్దాయన మందకృష్ణ రావడం, మంతనాలు జరపడంపట్ల నియోజకవర్గంలో హాట్‌టాపిక్‌గా మారింది. ఈసందర్భంగా విఠల్ మందకృష్ణమాదిగను సన్మానించారు. మందకృష్ణను కలిసిన వారిలో మెట్టుపల్లి నరేందర్, మహేష్, గాడి దేవదాస్, ములుగు నరేందర్, రవి, ప్రశాంత్, యాదగిరి, బబ్లు, ప్రసాద్, కృష్ణ పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి

-క్రికెట్ టోర్నమెంట్‌ని ప్రారంభించిన మాజీసర్పంచ్ కొమ్ము కృష్ణ

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ కొమ్ము కృష్ణ

నందిగామ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

క్రీడలు యువకులమధ్య స్నేహసంబంధాలతోపాటు మానసిక ఆరోగ్యాన్ని స్తాయని నందిగామ మాజీసర్పంచ్ కొమ్ము కృష్ణ స్పష్టంచేశారు. మంగళవారం నందిగామ మండలకేంద్రంలో ఆయన క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఓడినవారు బాధపడకుండా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. వేసవికాలం పైగా మండుతున్న ఎండలను దృష్టిలోపెట్టుకొని క్రీడాకారులు ఆరోగ్య విషయమై పలుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రోడ్డు వేయాలని కమిషనర్‌కి వినతి

మేడ్చల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వ్యాపరస్థులు

మేడ్చల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

మేడ్చల్ పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీ రోడ్డును త్వరితగతిన వేసి దుమ్ములేకుండా చూడాలని కోరుతూ కాలనీలోని వ్యాపారస్తులు, ఇండ్ల యజమానులు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. హౌజింగ్‌బోర్డు కాలనీ మేయిన్ రోడ్డులో అంతర్గత సెంట్రల్ డ్రైనేజీని ఏర్పాటు చేయడం అభినందనీయమని, కానీ డ్రైనేజీ వేసి రోడ్డు వేయకుండా ఊరుకోవడంతో ఆ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి దుమ్ములేచి ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దుమ్ముతో వ్యాపారం చేసుకోలేకపోతున్నామని, ఇండ్లల్లో ఉండలేకపోతున్నామని వెంటనే రోడ్డును వేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యాపారస్తులు దాత్రిక లక్ష్మన్, మహేష్, శేకర్, సంతోష్, వంశీధర్, నాయరాయణ, షేక్ అబ్దుల్, గౌతం, వర్దారెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలి

-టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లపంపిణీ
-రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ రాజేశం
-పాల్గొన్న డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమాగౌరి

పౌష్టికాహార కిట్లను పంపిణీచేస్తున్న రాష్ట్ర జాయింట్‌డైరెక్టర్ రాజేశం, డిఎండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమాగౌరి

మేడ్చల్‌జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

టిబి వ్యాధిగ్రస్థులు మందులతో పాటు మంచి పౌష్టికాహారం కూడ తీసుకోవాలని రాష్ట్ర జాయింట్ డైరక్టర్‌రాజేశం సూచించారు.మంగళవారం మేడ్చల్ జిల్లాలో టిబి వ్యాధిగ్రస్తులు (రోగులు) ఆరోగ్యంగా ఉండటానికి టిబి మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవటానికి పౌష్టికాహార కిట్లను ఆయన పంపిణీచేశారు. ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో టిబి ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా టిబి రోగులకు ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్ సంస్థ నిశ్చయితమిత్ర నమోదుచేసుకుని వారి సహకారంతో పౌష్టికాహారం కిట్లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర జాయింట్ డైరక్టర్ టి.బి.డాక్టర్ రాజేశం మాట్లాడుతూ మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవటంవల్ల వ్యాధినుంచి త్వరగా కోలుకోవచ్చని అన్నారు. డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమా గౌరి మాట్లాడుతూ క్షయవ్యాధిని నివారించటంలో ముందస్తు వ్యాధి నిర్ధారణ పూర్తి కాలం మందులు వాడటం చాలా అవసరమని అన్నారు. మేడ్చల్ జిల్లాలో 6టిబి యూనిట్లలో 750మంది రోగులకు రెండు నెలలకు సరిపడా 1500న్యూట్రిషన్ కిట్లను పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో చేపట్టటం జరిగిందన్నారు. ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్ సంస్థ వారు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, పిహెచ్‌సి ఉప్పల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌశీల్యా, శ్రీఅభిలాష్ స్టేట్ ప్రాజెక్టు లీడర్ ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్, శ్రీనివాస్, వాసు ప్రసాద్, రాష్ట్ర జాయింట్ డైరక్టర్ టిబిసెల్, బోగ ప్రకాశ్, సూపర్‌వైజర్, డిస్ట్రిక్ టిబి సిబ్బంది, పిహెచ్‌సి సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

చలో వరంగల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు

వికారాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

ఈ నెల 27న వరంగల్ లో నిర్వహించ నున్న బిఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని కోరుతూ బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గోపాల్‌ముదిరాజ్ చలో వరంగల్ పోస్టర్‌ను మంగళవారం పార్టీకార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమపార్టీగా ఆవిర్భవించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన బిఆర్ఎస్‌పార్టీ రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎన్నిపార్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చినా, తెలంగాణరాష్ట్రం సాధించిన బిఆర్ఎస్ పార్టీనే ప్రజలు విశ్వసిస్తారని అన్నారు. భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టడం ఖాయమని, ఏ ఎన్నికలు వచ్చినా గులాబి జెండా రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తంచేశారు. కల్లబొల్లి హామీలు ఇచ్చి గద్దెనెక్కి కాంగ్రెస్‌పార్టీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధిచెబుతారని అన్నారు. బిఆర్ఎస్‌పార్టీ ఆవిర్భావపండుగను రానున్న ఎన్నికల్లో విజయోత్సవ సభలా భావించి చలో వరంగల్‌కు భారీగా ప్రజలు తరలిరావాలని సూచించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, కిరణ్ పటేల్, రమేష్‌గౌడ్, రాములు, మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ విజయ్‌కుమార్, పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షులు సుభాన్‌రెడ్డి, పట్టణ ప్రధానకార్యదర్శి గాండ్ల మల్లికార్జున్, పట్టణ మైనార్టీవిభాగం అధ్యక్షులు ముర్తుజా ఆలీ, సీనియర్ నాయకులు. మల్లేశం, గంగారం వెంకట్, దేవదాసు, మంచన్‌పల్లి సురేష్, నాయకులు సురేష్‌గౌడ్, గోపి, కిషోర్, నర్సింహా, దశరత్‌రెడ్డి, సత్యనారాయణ, పట్టణ యువజన విభాగం ఉపాధ్యక్షులు బిఆర్ తేజ, సోషల్‌మీడియా అధ్యక్షులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిని కలిసిన ధారూర్ బిజెపి నేతలు

ఈటెల రాజేందర్‌ను కలిసిన ధారూర్ మండల బిజెపి నేతలు

ధారూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్‌కు ధారూర్ మండల బిజెపినాయకులు పాండుగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాములు, జిల్లా కార్యదర్శి విజయరాజ్, జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్, బంట్వారం మండల అధ్యక్షులు మహేష్ యాదవ్, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షులు సాయిగౌడ్, బంట్వారం మండల ప్రధాన కార్యదర్శి నాగరాజ్‌యాదవ్, సందీప్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై నాయకులతో సమావేశం

రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

ఓటరు జాబితా సవరణపై మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్దార్ విజయ్‌కుమార్ సమావేశం నిర్వహించారు. 18సంవత్సరాలునిండిన యువతీయువకులు ఓటరు నమోదు చేసుకోవాలని తెలిపారు. జాబితాలో మార్పులు, చేర్పులు, చనిపోయిన వారి పేర్ల తొలగింపుకు సహకరించాలని కోరారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పట్టా భూములకు పరిహారం చెక్కులు

పరిహారం అందజేస్తున్న తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

దుద్యాల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

పారిశ్రామిక వాడ ఏర్పాటుకు భూములు కోల్పోతున్న హకీంపేట్ గ్రామానికి చెందిన రైతులకు తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ మంగళవారం చెక్కులు పంపిణీ చేశారు. హకీంపేట్ గ్రామానికి చెందిన 33 మంది రైతులకు సంబంధించిన 56.04 ఎకరాల పట్టా భూములకు చెందిన రూ.11 కోట్ల 22 లక్షల పరిహార చెక్కులు తాండూర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధికి సహకరించాలని అన్నారు. చాలామంది రైతులు పారిశ్రామికవాడ ఏర్పాటు కోసం భూములు ఇవ్వడానికి ముందుకు వస్తున్నట్లు తెలిపారు. పరిహారం విషయంలో రైతులు ఎలాంటి అపోహాలు నమ్మవద్దని అందరికీ సమానమైన పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. మిగతారైతులుకూడా భూములు ప్రభుత్వానికి అప్పగించి పరిహారం పొందాలని సూచించారు. హకీంపేట్ గ్రామంలో పట్టాభూములు 50శాతంకంటే అధికంగా అందించారని వివరించారు.

స్లాట్ బుకింగ్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

-డాక్యుమెంట్‌రైటర్ల నిరసన

ఎస్ఆర్ఓ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న దస్తావేజు లేఖకులు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్లాట్‌బుకింగ్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని టిడిడబ్ల్యుఎఫ్ డిమాండ్ చేసింది. ఘట్‌కేసర్‌లో మంగళవారం స్థానిక దస్తావేజు లేఖరులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఎలాంటి దస్తావేజులు తయారు చేయకుండా విధులు మానేసి ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. రాష్ట్రంలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుటుందని తెలిపారు. ఫైలస్ ప్రాజెక్టు కింద చేపట్టిన 22 ఎస్ఆర్ఓ కార్యాలయాల్లో స్లాట్ పద్ధతి నిర్వీర్యం అయిందని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తే వినియోగదారులు ఇబ్బందులకు గురవుతారని పేర్కొన్నారు. ఉద్యోగాలు దొరకక స్వయం ఉపాధి కింద దస్తావేజు లేఖరులుగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నామని తెలిపారు. స్లాట్ బుకింగ్ విధానంతో రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది యువత ఉపాధి కోల్పోతారని డాక్యుమెంట్ రైటర్ల బతుకులు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్లాట్‌విధానాన్ని ఉపసంహరించుకోవాలని టిడిడబ్ల్యుఎఫ్ సభ్యులు డిమాండ్ చేశారు. రెండురోజుల పాటు సమ్మె నిరసన కొనసాగుతుందని వారు స్పష్ట ంచేశారు.

అంబేద్కర్ చూపిన దారిలో సాగాలి

-ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కొత్తూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మహానాయకుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కొత్తూర్ మండలంలోని తీగాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ మైసిగళ్ల రమాదేవిరమేష్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే ప్రధాన లక్ష్యం..

-ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పాదయాత్రలో ప్రజాస్వామ్యపరిరక్షణకుసంకల్పం.కొత్తూర్‌మండలంలోని వైఎంతండా, సిద్ధాపూర్, ఎస్‌బిపల్లి, కోడిచెర్లగ్రామాల్లో మంగళవారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో జరిగిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పాదయాత్ర కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, సీనియర్‌నాయకుడు మామిడి శ్యాంసుదర్‌రెడ్డి కార్యక్రమం ఇంచార్జీ జైపాల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... రాజ్యాంగవిలువలపై ప్రజల్లో అవగామన పెంచడం ఈకార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన పిలుపుమేరకు ప్రజాస్వామ్యపరిరక్షణకోసం దేశ వ్యాప్తంగా ఈ ఉద్యమం కొనసాగుతుంది. అలాగే రాజ్యాంగం కేవలం ఓపుస్తకంకాదు. అంబేద్కర్, గాంధీ, పూలే వంటి మహానీయుల ఆలోచనల సమాహారం. ఈపవిత్రగ్రంథాన్ని పరిరక్షించడం మనబాధ్యత కానీ బిజెపిపార్టీ రాజ్యాంగాన్ని నీరుగార్చే కుట్రలు చేస్తుంది. పేదల అభ్యున్నతి కోసం కాంగ్రెస్‌ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

టిజిఐఐసి భూములవ్యవహారంపై తేల్చుకుపోతా..

పేదలకోసం కేటాయించిన భూములను గత ప్రభుత్వంలోని నాయకులు అమ్ముకుపోయారు. ఈవ్యవహారంపై విచారణ కొనసాగుతుంది. ఎవరు తప్పు చేశారో వాళ్లను ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టమన్నారు. నాపై చేసిన ఆరోపణలు నిరూపిస్తే తడిబట్టలతో గుడిచుట్టూ తిరుగుతాను. కానీ దమ్మున్నవారు ముందుకురావాలి అంటూ ఆయన ప్రత్యర్థులపై గట్టిగా స్పందించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, సిద్దాపూర్ శేఖర్‌రెడ్డి, ఎస్బీపల్లి మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, శివశంకర్‌గౌడ్, నరసింహ, కే.సురేందర్, బాబర్‌ఖాన్, కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, సాయితేజేశ్వర్, నరసింహా తదితరులు ఉన్నారు.

తండాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

-కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అవుటి శేఖర్..

సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

దుద్యాల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

గిరిజన తండాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని దుద్యాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అవుటి శేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని సత్తర్ కుంట తండా పరిధిలోని నాన్యానాయక్ తండాలో రూ.5లక్షలతో నిర్మించే సిసి రోడ్డు ప నులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మండల అభివృద్ధివై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. ప్రజలు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ముఖ్యంగా ప్రభుత్వం గిరిజన తండాల ు అభివృద్ధి చేసేందుకు మరింతగా శ్రద్ధవహించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవిదాస్, రవి, మల్లేష్ నాయక్, లాల్యానాయక్, లచ్చా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

పాదయాత్రలో టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్

కీసర, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

భారతరాజ్యాంగాన్ని కాపాడుకుందామని టిపిసిసి ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు.మంగళవారం ఏఐసిసి పిసిసి పిలుపు యేరకు దమ్మాయిగూడ మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పా రామారావు ఆద్వర్యంలో రాజీవ్‌గృహకల్ప కాలనీలో జైబాపు,జైభీమ్,జైసంవిధాన్ రాజ్యాంగ రక్షణ పాదయాత్రలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని,దానిని మార్చే కుట్రలు బిజేపిప్రభుత్వం చేస్తుందని అన్నారు.పేద కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ పధకాన్ని ప్రవేశపెట్టిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డిదే అని కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కోల క్రిష్ణయాదవ్,నియోజకవర్గ బి బ్లాక్ అధ్యక్షురాలు ఈగ శ్వేత రాజు ముదిరాజు,మున్సిపల్ కార్పొరేషన్ మహిళా అధ్యక్షురాలు శోభారాణి,ఉపాధ్యక్షురాలు గుజ్జుక నర్మద పరశురాం,మాజీ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి,కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి,కీసరగుట్ట ట్రస్టు బోర్డు సభ్యులు ప్రసాద్‌గౌడ్,మాజీ ఎంపిటిసి బెలిదే రమేషన గుప్తా,సీనియర్ నాయకులు మంచాల ప్రవీణ్‌కుమార్,నర్సింగ్‌రావు,శ్రీకాంత్‌రెడ్డి,సంతోష్‌గౌడ్,లక్ష్మణ్‌శర్మ,అనిల్ యాదవ్,జూపల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మని దర్శించుకున్న ఏనుగు సుదర్శన్‌రెడ్డి

అమ్మవారిని దర్శించుకున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి

శామీర్‌పేట, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

శామీర్‌పేట పెద్దచెరువు కట్టమైసమ్మ అమ్మవారిని మేడ్చల్ నియోజకవర్గ బిజెపి అభ్యర్థిగా పోటీచేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, పలువురు బిజెపి నాయకులు దర్శించుకున్నారు. మంగళవారం శామీర్‌పేట పెద్దచెరువు శ్రీకట్టమైసమ్మ అమ్మవారిని బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. ఆతరువాత శామీర్‌పేటలో జరిగిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్, మండలపార్టీ నాయకులు డి.పవన్‌గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, బోయిని శివ, శరత్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ గిరిజన సమాఖ్య మేడ్చల్ జిల్లా

గిరిజన సమాఖ్య మహాసభల పోస్టర్

శామీర్‌పేట, ఏప్రిల్ 15, ప్రభాతవార్త

తెలంగాణ గిరిజన సమాఖ్య మేడ్చల్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని, గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలంగాణ గిరిజన సమాఖ్య మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి తోటపల్లి శంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం మూడుచింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలో గిరిజన సమాఖ్య మహాసభల పోస్టర్‌ను మండల సిపిఐ కార్యదర్శి టి.రాములుగౌడ్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి స్వరూపానాయక్, జిల్లా అధ్యక్షులు శ్యామలలత అధ్వర్యంలో మహాసభల పోస్టర్‌ను కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ గిరిజన హక్కుల సాధన కోసం అభివృద్ధివై పోరాడుతున్నట్లు వివరించారు. గిరిజన సమాఖ్య జిల్లా మహాసభలు ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని గిరిజనులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

మండల గిరిజన సమాఖ్య నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక..

తెలంగాణ గిరిజన సమాఖ్య మూడుచింతలపల్లి మండల గిరిజన సమాఖ్య నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మండలంలోని కేశవరంలో మండల గిరిజన సమాఖ్య నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గిరిజన సమాఖ్య కన్వీనర్‌గా దాసరి వేణు, కో కన్వీనర్‌గా మూడావత్ రాజమణి, మండల కౌన్సిల్ సభ్యులుగా దాసరి రవి, దాసరి లక్ష్మి, దాసరి అంజమ్మ, దాసరి మల్లమ్మ, దాసరి లతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడుచింతలపల్లి మండల సిపిఐ కార్యదర్శి టి.రాములుగౌడ్ ఆధ్వర్యంలో జిల్లా నాయకుల సమక్షం